క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటిన బుచ్చయ్య తదితరులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఫారెస్టు సెక్షన్ అధికారి బుచ్చయ్య అన్నారు. మండల పరిధిలోని చౌదారంలో అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పెంచడం ద్వారా భవిష్యత్ తరాలను కాలుష్యం నుంచి రక్షించడమే కాకుండా ప్రశాంత వాతావరణంలో జీవించగలుగుతామన్నారు. కార్యక్రమంలో బీట్ అధికారులు సుమన, శ్రీకాంత్, మాజీ సర్పంచ్ అనిత బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవ అవసరం



శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవలను అలవర్చుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శారద సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్(నేషనల్ సర్వీస్ స్కీం) ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. కళాశాలలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడంతోపాటు, చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవడానికి ఎన్ఎస్ఎస్ నిర్వహించే శిబిరాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు రామచంద్రయ్య, చంద్రయ్య, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక లాభాలు



అవగాహన కల్పిస్తున్న ఏఈఓ అఖిల్

మిరుదొడ్డి(దుబ్బాక): సంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియాతోనే అధిక లాభాలు పొందవచ్చని ఏఈఓ అఖిల్ అన్నారు. మండల పరిధిలోని అందె రైతులకు నానో యూరియా వాడకంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట ఆకులపై నానో యూరియాను పిచికారీ చేస్తే మొక్కలు పోషకాలను సమర్థవంతంగా గ్రహించి దిగుబడి ఎనిమిది శాతం పెరుగుతుందన్నారు. భూగర్భ జలాల్లోకి నత్రజని చేరడం తగ్గి పర్యావరణ కాలుష్యాన్ని నివారిస్తుందని, రసాయన ఎరువుల వాడకాన్ని మోతాదులో వాడుకుంటూ భూ సారాన్ని కాపాడుకోవాల్సిన అవశ్యకత రైతులందరిపై ఉందని సూచించారు.

గ్రామాలలో కనీస సౌకర్యాలు కల్పించండి

పోసాన్‌పల్లి, అయినాపూర్ గ్రామస్తులు



ఎంపీడీఓ శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని పోసాన్‌పల్లిలో కనీస సౌకర్యాలు కల్పించాలని పంచాయతీ కార్యదర్శి జావీద్‌కు, అయినాపూర్‌లో సమస్యలు పరిష్కారించాలని ఎంపీడీఓ శ్రీనివావర్మకు ఆయా గ్రామస్తులు సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించడం లేదన్నారు. దీంతో ఈగలు, దోమలు విజృంభించడంతో విషజ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని వాపోయారు. అలాగే వీధిలైట్లు వెలగకపోవడంతో రాత్రిపూట ఇబ్బందులకు గురవతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అయినాపూర్ మేజర్ పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శి లేకపోడంతో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వెంటనే అధికారులు స్పందించి గ్రామాలలో సమస్యలను పరిస్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇస్తారి, సాయిలు, రాజు, నర్సింహులు, ఎల్లయ్య, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

లేదయ్యా.. యూరియా!

వానాకాలం ఇదేమి చోద్యం

- ఎరువుల దుకాణాల వద్ద పడిగాపులు
- కొరతతో రైతులకు తప్పని తిప్పలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



రాయపోల్‌లో యూరియా కోసం బారులు తీరిన రైతులు

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్నట్లుంది రాయపోల్, దౌల్తాబాద్ మండలాల్లోని రైతుల పరిస్థితి. అసలే వానలు అనుకున్న సమయానికి కురువక పోవడంతో విత్తనాలు మొలకెత్తక నష్టపోయే దుస్థితి. ఇటీవల అక్కడక్కడా వర్షాలు కురుస్తుండడంతో రైతులు పత్తి, మొక్కజొన్న, కంది తదితర విత్తనాలు చల్లారు. మొలకలు రావడంతో ఎరువులు వేయడానికి సిద్ధమయ్యారు. కానీ యూరియా కొరత వారి పాలిట శాపంగా మారింది.

దుబ్బాకటౌన్: యూరియా అందుబాటులో లేకపోవడంతో మండల పరిధిలోని రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఫర్టిలైజర్ దుకాణాల ఎదుట బారులు తీరుతున్నారు. యూరియా కొరత ఏర్పడడంతో ప్రతిరోజు ఎరువుల దుకాణాల ఎదుట పడిగాపులు పడుతున్నారు.

కొంత మంది రైతులకే..

ఇటీవల రాయపోల్, దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఆగ్రోస్ సెంటర్‌కు యూరియా రావడంతో ఉదయం నుంచే రైతులు క్యూ లైన్‌లో నిలబడి తిప్పలు పడుతున్నారు. అన్ని పనులు మానుకొని వివిధ గ్రామాల నుంచి వచ్చిన అన్నదాతలు నిరాశ చెందుతున్నారు. క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడి వేచి చూసినా యూరియా దొరకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

వేధిస్తున్న కొరత

రాయపోల్, దౌల్తాబాద్ మండలాల్లో మొక్కజొన్న, పత్తి, వరి విత్తనాలు వేశారు. ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు మొలకలు వచ్చాయి. ఈ సమయంలో యూరియా కొరత వేదిస్తుందని రైతులు వాపోతున్నారు. ఈ సీజన్‌లో అధిక శాతం రైతులు మొక్కజొన్న సాగుచేశారు. అధికారులు స్పందించి సాగుకు తగినట్టు యూరియాను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

సరిపడా యూరియా అందించండి



అసలే ఈ యేడాది సరిగా వర్షాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పుడు యూరియా కొరత భయాందోళనకు గురిచేస్తోంది. నేను రెండెకరాల్లో వరి సాగుచేశాను. యూరియా కొరతతో ఇంకా ఎరువులు చల్లలేదు. ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా సరఫరా చేసి రైతులకు అండగా ఉండాలి.

– ముత్యాల నర్సింహులు,రైతు, సూరంపల్లి

చర్యలు తీసుకుంటున్నాం



యూరియా కొరత ఉందని రైతులు అధైర్య పడొద్దు. రైతులకు సరిపడా యూరియా అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. సమస్య పరిష్కరించేలా కృషిచేస్తాం. రైతులు యూరియా వినియోగం తగ్గించి నానో యూరియా, సేంద్రియ ఎరువుల వాడాలి.

– బాబూనాయక్, ఏడీఏ, గజ్వేల్

సకల విద్యాప్రదాయిని సరస్వతీదేవి

ఉద్యాన విశ్వవిద్యాలయ వీసీ రాజిరెడ్డి



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న రాజిరెడ్డి, అధికారులు

ములుగు(గజ్వేల్): విద్యకు ఆది దేవత అయిన సరస్వతీదేవి జ్ఞానాన్ని ప్రసాదిస్తుందని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దండా రాజిరెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయంలోని అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో శుక్రవారం సరస్వతిదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను, ప్రతిష్టను, కవితాశక్తిని సరస్వతి దేవి అనుగ్రహిస్తుందన్నారు. వేద బ్రాహ్మణులు హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో యూనివర్శిటీ అధికారులు భగవాన్, చీనా నాయక్, లక్ష్మీనారాయణ, సురేశ్‌కుమార్, రాజశేఖర్, శ్రీనివాసన్, విజయ, నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్



మాట్లాడుతున్న కమిషనర్ రమేశ్‌కుమార్

దుబ్బాక: ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో వార్డులలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రతకు వార్డు అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన పాత ఇళ్లను గుర్తించి వాటి యజమానులకు నోటీసులు అందించాలన్నారు. వార్డులలో పిచ్చి మొక్కలు, గడ్డిని ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. గడ్డి మందను స్ప్రే చేయించడంతోపాటు దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని చెప్పారు. మున్సిపల్‌లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఆదేశించారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరమ్మ మహిళాశక్తి సంబురాల్లో పాల్గొన్నారు. మహిళలు వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. టీపీఓ గిరిధర్, మేనేజర్ శ్రీనివాస్, వార్డు అధికారులు, మెప్మా సీఈఓ సరిత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కేటాయించిన స్థలం కబ్జా

- మంత్రి పొన్నం పేరుతో కబ్జాలు
- బీజేపీ నాయకులు



స్థలాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలో గిరిజన బాలికల గురుకులానికి కేటాయించిన స్థలాన్ని కొంతమంది కబ్జా చేయడంపై బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఏనేశివారులో కబ్జాకు గురైన స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పేరుతో గౌడసంఘం నాయకులు రాత్రికి రాత్రే జేసీబీలతో చదను చేయడం ఘోరం అన్నారు. ఆ స్థలాన్ని అక్రమార్కుల చేతుల నుంచి స్వాధీనం చేసుకొని తిరిగి గిరిజన పాఠశాలకు కేటాయించాలని, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గౌడసంఘం నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. నాయకులు వేణుగోపాల్ రావు, నరేశ్, వీరాచారి, రవీకుమార్, మోహన్‌నాయక్, లావుడ్యా రైనానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో పదిమంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.17,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

'ప్రి ప్రైమరీ'ని కొనసాగించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

దుబ్బాక: ఐదేళ్లలోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ప్రి ప్రైమరీ స్కూల్ విధానాన్ని కొనసాగించాలని సీఐటీయూ పట్టణ కన్వీనర్ భాస్కర్ కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు శుక్రవారం ఎంఈఓ ప్రభుదాసుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్ఈపీ నూతన విద్యావిధానం చట్టం ప్రకారం ఐదు సంవత్సరాలలోపు పిల్లలను అంగన్‌వాడీల్లోనే ఉంచాలన్నారు. పిల్లలను బలవంతంగా ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించే వైఖరిని ఆపాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు అనురాధ, దీనమ్మ, సుమిత్ర, రాములమ్మ, రమ, సరస్వతి, సుమతి తదితరులు పాల్గొన్నారు.

నలుగురికి గాయాలు

మిరుదొడ్డి(దుబ్బాక)/దుబ్బాకరూరల్: వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలయ్యాయి. మిరుదొడ్డి మండలంలోని రామాయంపేట నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న ఓ కారు, దుబ్బాక వైపు వెళ్తున్న ఆటో ధర్మారం మూల మలుపు వద్ద ఢీకొన్నాయి. దీంతో ఆటో డ్రైవర్ దేవేందర్‌రెడ్డి, కారులో ప్రయాణిస్తున్న ఒకరికి గాయాలయ్యాయి. అలాగే దుబ్బాక రూరల్ మండలంలోని ధర్మాజీపేటకు చెందిన కనకరాజు బైక్‌పై హబ్సీపూర్ వైపు వస్తున్నాడు. మెదక్ జిల్లా నిజాంపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన దుద్దెడ స్వామి సిద్దిపేట వైపు వెళ్తుండగా బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో వారిద్దరు గాయపడ్డారు.

పెరిగిన జనాభా, ఓటర్లు
పెరగని వార్డుల సంఖ్య

నష్టపోతున్న శివారు కాలనీలు



మున్సిపల్ కార్యాలయం

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల పట్టణం 2018 ఆగస్టులో మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారింది. అప్పటి వరకు 2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణ జనాబా 18 వేలకు పైగా ఉండగా, 11,951 మంది ఓటర్లు ఉన్నారు. అందుకు అనుగుణంగా ట్టణాన్ని 12 వార్డులుగా విభజించి మున్సిపాలిటీ చేశారు. కానీ చేర్యాలతో పాటు నూతనంగా ఏర్పాటైన దుబ్బాక మున్సిపాలిటీని 20 వార్డులుగా విభజించారు. గతంలో 18 వేల పైచిలుకు ఉన్న జనాభా ప్రస్తుతం సుమారు 20 వేలకు పెరిగింది. 13,678 మంది ఓటర్లున్నారు. ఒక్కో వార్డులో 900 మంది ఓటర్లకు తగ్గకుండా వార్డుల విభజన చేపట్టాల్సి ఉండగా చేర్యాల మున్సిపాలిటీలో 14 వార్డులకు బదులుగా 12 వార్డులు మాత్రమే ఉన్నాయి. దీంతో జనాభా ప్రాతిపదికన కేటాయించే నిధులు సరిపోక శివారు కాలనీలు అభివృద్ధికి దూరమయ్యాయి. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కొన్ని మున్సిపాలిటీల్లో వార్డుల సంఖ్య పెంపు కోసం నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం చేర్యాల మున్సిపాలిటీలోనూ పెరిగిన ఓటర్లు, జనాభా అనుగుణంగా వార్డుల విభజన చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. జనాభా, ఓటర్లు, నివాసాలకు అనుగుణంగా వార్డులు 15కు పెంచాలి. అలా చేమడం వల్ల శివారు కాలనీలు అభివృద్ధి చెందుతాయని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి అన్నారు.

గురువులు మానవాళికి మార్గదర్శకులు

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



వజ్రపురస్కారాలు పొందిన గురువులతో గరీమాఅగర్వాల్

సిద్దిపేట(ప్రశాంత్‌నగర్): గురువులు మానవాళికి మార్గదర్శకులు అని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. వ్యాసమహర్షియోగా సొసైటీ, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో గురువారం రాత్రి స్థానిక యోగా కేంద్రంలో జరిగిన గురుపూర్ణిమ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మనదేశంలో గురువులకు విశిష్టస్థానం ఉందని, సమాజాన్ని సన్మార్గంలో నడపడంలో వారి కృషి ఎనలేనిదని కొనియాడారు. వివిధరంగాల్లో సేవలందిస్తున్న గురువులకు వజ్ర పురస్కారాలను అందించడం అభినందనీయమని చెప్పారు. అనంతరం విద్యాశాఖ జిల్లా ఎస్ఓ రామస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యాసమహర్షి యోగా సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్రయోగా అధ్యయన పరిషత్ సభ్యుడు, యోగా గురువులు తోట సతీశ్, సంధ్య, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, తపస్ జిల్లా అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, విక్రంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8 బిలియన్లు దాటిన ప్రపంచ జనాభా

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భవాని



దుబ్బాక: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భవాని

దుబ్బాక: ప్రస్తుతం ప్రపంచ జనాభా సుమారు ఎనిమిది బిలియన్లు దాటిందని, భారతదేశ జనాభా దాదాపు 146.6 కోట్లు ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భవాని అన్నారు. కళాశాలలో అర్థశాస్త్రం విభాగం అధ్యాపకులు సునీత ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పెరుగుతున్న జనాభా, సమస్యలు, పర్యావరణంపై ప్రభావం, వనరుల కొరత తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జనాభా నియంత్రణపై అవగాహన

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని అందెలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం జనాభా నియత్రణపై ఉపాధ్యాయులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెజ్జంకిలో ఉన్నత పాఠశాలలో..

బెజ్జంకి(సిద్దిపేట): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగయ్య, ఉపాధ్యాయులు లయన్స్ క్లబ్ ప్రతినిధులు శ్రీనివాస్‌రావు, సత్యనారాయణ, బాబాయి మాత, రవీంద్ర ప్రసాద్, మాలతి, సరిత పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

బిస్మాట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి



సిద్దిపేటజోన్: మొక్క నాటుతున్న మల్లారెడ్డి

సిద్దిపేటజోన్: మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని బిస్మాట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి సూచించారు. స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పచ్చదనం–పరిశుభ్రత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థిదశ నుంచే సామాజిక బాధ్యత గురించి వివరించాలని సూచించారు. ప్రిన్సిపాల్ నయన, చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం..

ములుగు(గజ్వేల్): పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలు నాటాలని గజ్వేల్ డివిజన్ ఫారెస్ట్ రేంజ్ అధికారి వినాయక్ పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా ములుగు మండలం చిన్నతిమ్మాపూర్‌లో శుక్రవారం గ్రామస్తులు, ఆయా శాఖల అధికారులు, విద్యార్థులతో కలసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆక్సిజన్ శాతాన్ని పెంచేందుకు, వర్షాలు పడేందుకు మొక్కలు ఎంతో ఉపయోగపడుతాన్నారు. ఎంపీడీఓ మేరీ స్వర్ణకుమారి, ఫారెస్ట్ సెక్షన్ అధికారి షెకావత్ హుస్సేన్, బీట్ అధికారి ప్రసాద్, ఎంపీఓ వినోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **మొక్కలు నాటడం అందరి బాధ్యత**

చేర్యాల(సిద్దిపేట): మొక్కలు నాటి సంరక్షించడం మనందరి బాధ్యత అని పీఏసీఎస్ చైర్మన్ మేర్గు కృష్ణాగౌడ్ అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సహకార సంఘం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. శ్రీనివాస్, రవి, బాల్‌నర్సయ్య, మహిపాల్‌రెడ్డి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **తల్లిదండ్రుల తర్వాతి స్థానం గురువులదే..**

సిద్దిపేటకమాన్: తల్లిదండ్రుల తర్వాతి స్థానం గురువులదేనని అఖిల భారత హనుమాన్ దీక్ష పీఠం సిద్దిపేట విభాగం నాయకుడు గ్యాదరి పరమేశ్వర్, నేతి కైలాసం అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఏల్ల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి వారు మాట్లాడారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీకి శనివారం గురుపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ట్రస్మా నాయకులు నరేశ్, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి**

హుస్నాబాద్‌రూరల్: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే ఆరోగ్యంగా ఉంటామని ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చేపట్టిన డ్రై డే కార్యక్రమాలను పరిశీలించారు. మంగళ, శుక్రవారం ఇంటింటికి తిరిగి పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

◆ **అలసత్వం చూపొద్దు: ఎంఈఓ**

కొండపాక(గజ్వేల్): బోధనపై అలసత్వం చూపవద్దని ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు. మండల పరిధిలోని బొబ్బాయిపల్లి, మంగోల్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. బేస్‌లైన్ పరీక్ష పేపర్ల తీరులకు అనుగుణంగా విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలన్నారు. సీఆర్పీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

◆ **నాలుగు ట్రాక్టర్లు స్వాధీనం**

దుబ్బాకరూరల్: అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పోలీస్‌లు పట్టుకున్న ఘటన మండల పరిధిలోని ఆకారం గ్రామంలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. కూడవెల్లి వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు దాడిచేసి నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతి లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

◆ **కాంగ్రెస్ పాలనపై విమర్శలా?**

చిన్నకోడూరు(సిద్దిపేట): పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేయడం తగదని డీసీసీ కార్యదర్శి మీసం నాగరాజు ఆరోపించారు. శుక్రవారం చిన్నకోడూరులో పలువురు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు రాజయ్య, నర్సింహులు, స్వామి, శేఖర్, నాగరాజు తదితరులు ఉన్నారు.

◆ **టీవీ అందజేసిన హెచ్‌ఎం**

దుబ్బాకటౌన్: జన్మదిన వేడుకలు సందర్భంగా రాయపోల్ మండలం వడ్డేపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి పాఠశాలలో డిజిటల్ కార్యక్రమాల నిర్వహణకు టీవీని బహూకరించి ఆదర్శంగా నిలిచారు. ఎంఈఓ సత్యనారాయణరెడ్డి శుక్రవారం టీవీని ప్రారంభించారు. రూ.27 వేల విలువగల టీవీని బహూకరించడం సంతోషకరమన్నారు. బేగంపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం అంజిరెడ్డి, వడ్డేపల్లి పాఠశాల హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, సీఆర్పీలు స్వామి, యాదగిరి పాల్గొన్నారు.

◆ **యువతకు అవగాహన**

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో శుక్రవారం కృషికల్ప స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యవస్థాపకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, కృషికల్ప ప్రతినిధి ఈరన్న మాట్లాడారు. బలాలు, బలహీనతలు, అవకాశాలు, భయాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, గరుచరణ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ **మోడల్ స్కూల్లో సమస్యలు**

మద్దూర్(హుస్నాబాద్): స్థానిక మోడల్ స్కూల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ మండల నేత సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక నాయకులతో కలసి మోడల్ స్కూల్‌ను శుక్రవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో సమస్యల వల్లే విద్యార్థుల సంఖ్య తగ్గుతుందన్నారు. టాయిలెట్ల నిర్వహణ అధ్వానంగా ఉందని వాపోయారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. మల్లేశం, రవీందర్‌రెడ్డి, నర్సింహులు తదితరులు ఉన్నారు.

◆ **మాక్ పోలింగ్**

మిరుదొడ్డి(దుబ్బాక): స్థానిక మోడల్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులు మాక్ పోలింగ్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ అర్చన ప్రియదర్శిని మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి ఎన్నికలపైనే కాకుండా ఓటుహక్కుపై అవగాహన కలిగించడానికి మాక్ పోలింగ్ నిర్వహించినట్లు చెప్పారు.